భూ-చోళ్లు..!



టేకులోడు వద్ద పరిశ్రమలకు తీసుకుంటున్న భూములు



భూ పరిహారం కోసం మాయగాళ్ల ఎత్తులు

- టేకులోడు సెజ్‌లో అన్‌సెటిల్డ్ భూములపై కన్ను
- లేని వారసులను తెచ్చే ప్రయత్నం
- 50 ఎకరాల వరకు అపరిష్కృత భూములు
- దళారులకు ఇద్దరు అధికారుల సహకారం

చిలమత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పరిహారాన్ని మాయతో కాజేసేందుకు కొన్ని గుంట నక్కలు కాచుకుకూర్చున్నాయి. ఈక్రమంలోనే అన్‌సెటిల్డ్ భూములపై కన్ను వేశాయి. లేని వారసులను పుట్టించి పరిహారాన్ని ఫలహారం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. మండలంలోని టేకులోడు రెవెన్యూ గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ జరుగుతోంది. రైతులు సాగు చేసుకుంటున్న 600 ఎకరాల అసైన్డ్ భూములను సేకరించాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు వారికి పరిహారం అందించి, భూసేకరణ ప్రారంభించింది. అయితే ఈ 600 ఎకరాల్లో 24 మంది రైతులకు సంబంధించి సుమారు 50 ఎకరాలు చాలా కాలంగా అన్‌సెటిల్డ్‌గా (అపరిష్కృతంగా) ఉండిపోయింది.

అన్‌సెటిల్డ్ భూములపైనే కన్ను

2014-2019 మధ్య కాలంలో టేకులోడు రెవెన్యూ గ్రామంలో టి-హబ్ కోసం 200 ఎకరాలను రైతుల నుంచి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఆ సమయంలో అన్‌సెటిల్డ్ భూముల విషయంలో అవకతవకలు (మిగతా 6లో...)

అన్నదాతకు అండగా

ప్రభుత్వం

- రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలోని 2,65,040 మంది రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ కింద రూ180.87కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఓబీసీ రైతులకు ప్రభుత్వం 90శాతం, ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను అందిస్తోందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో డ్రిప్, స్ప్రింక్లర్లు, వ్యవసాయ పరికరాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దీంతో రైతులు బయట మార్కెట్‌లో పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు.. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. రైతుల పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఓ పట్టా నాటి తెగదే...!

వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని కోరుతున్న దొడఘట్ట నిరుపేద రైతులు

దశాబ్దాలుగా సాగులో ఉన్నా లభించని పట్టా

- 1951లో సొసైటీ కింద 284.71ఎకరాలకు పట్టా
- ప్రభుత్వ పథకాలు అందని 300మంది రైతులు
- అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్య

రొద్దం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాల కోసం దొడఘట్ట గ్రామ రైతులు ఎదురు చూస్తున్నారు. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్న కాలంలో కల్లుగీత కార్మికులకు దొడఘట్ట ల్యాండ్ కాలనైజేషన్ సొసైటీ కింద 284.71ఎకరాల భూమికి పట్టాలిచ్చారు. సర్వేనంబరు 259 నుంచి 514వరకు ఈ భూములు ఉన్నాయి. వీటి అనుభవం కోసం 30మంది రైతులతో ఓ సొసైటీని ఏర్పాటు చేసి, అధ్యక్షులుగా సంజీవప్పను నియమించారు. పట్టాలు కూడా సొసైటీ పేరుతోనే ఉన్నాయి. తర్వాత కాలంలో రైతులు ఉలవ, సజ్జ, కొర్ర, వేరుశనగ, కంది, పత్తి, (మిగతా 6వ పేజీలో..)

వ్యక్తిగతంగా పట్టాలివ్వండి



1951లో సొసైటీ పేరుతో ఇచ్చిన పట్టా భూమిని రద్దుచేసి ప్రస్తుతం ఉన్న 300మంది రైతులకు పట్టాలు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు ఏ ఒక్కటి వర్తించడం లేదు. ఎన్నో ప్రభుత్వాలు మారినా నిరుపేద బతుకులు మారలేదు. టీడీపీ ప్రభుత్వం పట్టించుకుని వ్యక్తిగతంగా పట్టాలివ్వాలి.

- ఈడిగ చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు

విధేయతకు పట్టం..

- జిల్లాకు రెండు నామినేటెడ్ పదవులు



లక్ష్మీనారాయణ



ఆర్ వెంకటరమణప్ప

పుట్టపర్తి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల భర్తీలో టీడీపీ విధేయతకు పట్టం కట్టింది. మంగళవారం రాష్ట్రంలో పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేశారు. జిల్లాకు రెండు పదవులు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సంక్షేమ, అభివృద్ధి సంఘం చైర్మన్‌గా మడకశిర మండలం జక్కేపల్లికి చెందిన టీడీపీ మండల మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణను నియమించారు. రాష్ట్ర సగర, ఉప్పర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలం రంగేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్ వెంకటరమణప్పను ఎంపిక చేశారు. వీరిరువురు టీడీపీకి విధేయులు. సీనియర్ నాయకులు కావడం, పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుడడంతోనే నామినేటెడ్ పదవులు దక్కాయి. జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్ పదవులు దక్కడంతో టీడీపీ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది.

కదిరి మున్సిపాలిటీ ఆదాయం పెంచాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్ సూచన



మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాలిటీ ఆదాయం పెంచి, అభివృద్ధి చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కదిరి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కదిరిలోని పాత మున్సిపల్ కార్యాలయం, హిందూపురం రోడ్డులోగల మున్సిపల్ ఉన్నత పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయనీ, వాటిని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. మున్సిపల్ ఆదాయం పెంచడానికి అవకాశమున్న అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవకుమార్, కమిషనర్ కిరణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ నరసింహమూర్తి, టీడీపీ నాయకుడు బాహుద్దీన్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను మూసేశారు..

- సిబ్బంది మాత్రం విధుల్లోనే.. • బియ్యం సరఫరా మామూలే
- తనకల్లు బీసీ బాలికల వసతి గృహంలో వింత






హాస్టల్‌లో నిల్వ చేసిన బియ్యం ప్యాకెట్లు, తనకల్లు బీసీ బాలికల హాస్టల్

తనకల్లు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అక్కడ హాస్టల్ ఉంది కానీ పిల్లలు లేరు. అధికారులు మాత్రం రెండు నెలల నుంచి బియ్యం సరఫరా చేస్తున్నారు. ఎవరి కోసం బియ్యం సరఫరా చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. మండల కేంద్రంలోని బీసీ బాలకల వసతి గృహాన్ని మూసేశారు. గత ఏడాది ఇక్కడ 30మంది కిపైగా బాలికలుండేవారు. ఈఏడాది హఠాత్తుగా హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులందరూ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. హాస్టల్‌లో చేరడానికి కొత్త వారెవరూ ముందుకు రాలేదు. దీంతో హాస్టల్ మూసేశారు. కానీ గత రెండు నెలలుగా హాస్టల్‌లో పనిచేస్తున్న సిబ్బంది మాత్రం ఇక్కడే ఉంటున్నారు. ప్రభుత్వం హాస్టల్‌లో పిల్లలు లేకపోయినా, బియ్యం సరఫరా చేసింది. జూన్ నెలలో 5 ప్యాకెట్లు, జూలైలో 20 ప్యాకెట్లు బియ్యం హాస్టల్‌కు పంపింది. వీటికి హాస్టల్‌లో పని చేస్తున్న సిబ్బంది ఇద్దరు కాపలాగా ఉంటున్నారు. విద్యార్థులు లేకపోయినా, హాస్టల్‌కు బియ్యం ఎందుకు పంపారో, సిబ్బందిని ఎందుకు ఇక్కడే ఉంచారో తెలియని పరిస్థితి. ఈవిషయంపై బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి బాలాజీని వివరణ కోరగా కదిరిలో ఒకే బీసీ హాస్టల్‌లో రెండువందలమంది విద్యార్థినులున్నారన్నారు. అందువల్ల తనకల్లులో విద్యార్థులు లేని హాస్టల్‌ను కదిరికి తరలించడానికి జిల్లా అధికారులకు నివేదికలు పంపినట్లు చెప్పారు. పది రోజుల్లో బీసీ బాలికల హాస్టల్‌ను తనకల్లు నుంచి కదిరికి తరలిస్తామన్నారు.

చిత్రావతి పరవళ్లు



పోతులనాగేపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

ధర్మవరంరూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలకు చిత్రావతి నది పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని పోతులనాగేపల్లి వద్ద మంగళవారం జోరుగా ప్రవహించింది. రెండురోజుల క్రితం కురిసిన వర్షాలకు కొత్తచెరువు, బుక్కపట్నం, చెన్నేకొత్తలపల్లి మండలాల నుంచి వర్షపునీరు చిత్రావతి నదిలోకి చేరుతోంది. దీంతో వరద పెరిగింది.

ఆగని వాన

పలు మండలాల్లో వర్షం

ఉప్పొంగిన వాగులు, వంకలు

ఉద్యాన పంటలకు నష్టం

(వివరాలు 6లో..)

ఎలుగుబంట్ల హల్‌చల్



రోడ్డు పక్కన సంచరిస్తున్న ఎలుగుబంట్లు

మడకశిర టౌన్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి పావగడ రోడ్డులోని చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం వద్ద మంగళవారం సాయంత్రం రెండు ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయి. వాటిని చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. రోడ్డు పక్కనే కావడంతో అనేక మంది సెల్‌ఫోన్‌లో బంధించేందుకు ఆసక్తి చూపారు. మడకశిరకు ఆనుకునే ఉన్న కొండ నుంచి వన్యప్రాణులు ఆహారం కోసం వస్తున్నాయి. దీంతో పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు.

96.47 శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థినికి మాత్ర వేస్తున్న ఆర్డీఓ

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లాలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని 96.47 శాతం పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్యకేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేశారు. జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆర్డీఓ సువర్ణ.. చిన్నారులకు మాత్రలు మింగించారు. ఆర్డీఓ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొదటిరోజు 3,53,279 మందికి మాత్రలను పంపిణీ చేశారు.





వెండిరథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు

వెండి రథంలో ఖాద్రీశుడు..

కదిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుల స్వామికి వెండిరథంతో ప్రాకారోత్సవం నిర్వహించారు. వెండిరథంపై కొలువుదీరిన స్వామివారికి సుగంధ పుష్పాలు, కదిరి మల్లెలు, తులసీమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవంవైభవంగా చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

కేంద్ర మంత్రి సోమణ్ణకు టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం వినతి

7

నెట్టికంటి స్వామికి వెండి రథ ప్రాకారోత్సవం

7

ఓ పట్టాన తెగదే..!

(5వ పేజీ తరువాయి)

మొక్కజొన్నతదితర పంటలు ఎవరికివారు సాగుచేసుకుంటూ వస్తున్నారు.

తరాలు మారినా పట్టాలు ఇవ్వరా?

రైతులతో కూడిన సొసైటీకి అధ్యక్షుడుగా ఉన్న ఈడిగ సంజీవప్ప పేరున దొడఘట్ట ల్యాండ్ కాలనైజేషన్ సొసైటీ కింద 284.71ఎకరాల భూమికి 1951లో అప్పటి ప్రభుత్వం పట్టా ఇచ్చింది. సంజీవప్ప మరణానంతరం శివరామప్ప, తరువాత హనుమంతప్ప, ఆయన తరువాత ఈడిగ చంద్రశేఖర్ అధ్యక్షులుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. నాలుగు తరాలు మారినా ఒకే పేరుతో 284.71ఎకరాల భూమి సాగులోనే ఉంది. దీంతో సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందడం లేదు. వ్యక్తిగతంగా పట్టాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.



బోరుకోసం తెచ్చిన పరికరాలు

విద్యుత్ కనెక్షన్ ఇవ్వని అధికారులు

తరాలుగా సాగు చేసుకుంటున్న భూమికి ప్రస్తుతం 300మంది వారసులు తయారయ్యారు. వీరు సాగులో ఉన్న భూమికి సంబంధించి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వ సాయం అందడం లేదు. బోరుబావులు తవ్వించుకున్నా కరెంటు కనెక్షన్ లభించని పరిస్థితి. ఈడిగ ఆదెమ్మ అనే రైతు తాను సాగు చేసుకుంటున్న భూమిలో మూడు బోర్లు వేయించారు. ఒక్కదానిలో నీరు పుష్కలంగా పడింది. విద్యుత్ కనెక్షన్ కోసం వెళితే నీ పేరుపై పట్టాదారు పుస్తకం లేదు కనెక్షన్ ఇవ్వడం కుదరదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టాక్రే నాయక్ అనే రైతుది కూడా అదే పరిస్థితి. కరెంటు వస్తుందన్న ఆశతో కరెంటు వైరు, డ్రిప్ సౌకర్యం, పైప్‌ల కోసం మోటారు కోసం రైతులు రూ.లక్షలు ఖర్చు చేశారు. విద్యుత్ కనెక్షన్ రాకపోవడంతో సామగ్రిని వారు మూలన పెట్టేశారు. సొసైటీలో కల్లుగీత కార్మికులు నామమాత్రంగా ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాల సభ్యులు అధికంగా ఉన్నారు.



బోరువేసినా మహిళ రైతు

సర్వే అటకెక్కించారు..

అనంతపురం జిల్లా కలెక్టర్ సోమేష్‌కుమార్ ఉన్నప్పుడు దొడఘట్ట సొసైటీ రైతులు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని విన్నవించుకోగా సర్వే అధికారులను పంపారు. భూములన్నీ సర్వేచేసి సాగులో ఎవరెవరు న్నారో వారికి పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేశారు. అయితే కలెక్టర్ సోమేష్‌కుమార్ బదిలీ కాగానే రెవెన్యూ అధికారులు భూములు సర్వే చేసి పట్టాలివ్వకుండా అటకెక్కించారు. తరువాత తహసీల్దార్ చుట్టూ తిరిగినా పట్టాలివ్వకపోవడంతో రైతులు నిస్సహాయ స్థితిలో పడిపోయారు.

చర్యలు తీసుకుంటాం

దొడఘట్ట గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములు పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రికార్డులు పరిశీలించి ఎవరెవరు సాగులో ఉన్నారో క్షేత్రస్థాయిలో పర్యటించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతాం. ప్రభుత్వం రైతులకు సొసైటీ కింద పట్టా ఎప్పుడిచ్చిందో పరిశీలిస్తాం. **-ఉదయ్‌శంకర్‌రాజు, తహసీల్దార్**

భూచోళ్లు..!

(5వ పేజీ తరువాయి)

జరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు. గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి ప్రభుత్వం టేకులోడు రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 1-10లో 2.32, సర్వేనంబర్ 1-16లో 2.37 ఎకరాలను అసైన్డ్ పట్టాగా ఇచ్చింది. అప్పట్లో ఈ భూమిని భూసేకరణలో తీసుకున్నారు. అయితే భూసేకరణ చేపట్టే సమయానికి భూయజమాని, అతని భార్య ఇద్దరు మృతి చెంది ఉన్నారు. వారికి రక్తసంబంధీకులు కూడా ఎవరూ లేకపోవడంతో ఆ భూమి అన్‌సెటిల్డ్ భూమిగా ఉండిపోయింది. దీనిని గుర్తించిన కొందరు దళారులు ఆ భూముకి వారసులుగా నకిలీ వ్యక్తులను తెరపైకి తీసుకువచ్చారు. మృతి చెందిన భూయజమాని రెండో భార్యగా ఒక మహిళను తెరపైకి తెచ్చారు. అధికారుల సాయంతో అన్‌సెటిల్డ్‌గా ఉన్న ఆ భూమికి ఆ మహిళను వారసురాలుగా ధ్రువీకరింపజేసి ఆమె పేరుతో పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయించారు. అనంతరం ఆమెకు ప్రభుత్వం నుంచి రూ. 30,48,500ల భూపరిహారాన్ని ఖాతాలో పడేటట్లు చేశారు. అలా పడిన మొత్తాన్ని దళారుల ఖాతాల్లోకి జమచేసుకున్నారు. అప్పట్లో ఈ విషయం సంచలనంగా మారింది. అయితే ఇప్పుడు కూడా ఇదే రీతిలో అన్‌సెటిల్డ్ భూముల్లో అవకతవకలకు పాల్పడి కోట్ల రూపాయలను కాజేసేందుకు కొందరు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

50 ఎకరాల వరకు అన్‌సెటిల్డ్ భూమి

టేకులోడులో పరిశ్రమల కోసం సేకరిస్తున్న భూముల్లో సుమారు 50 ఎకరాల వరకు అన్‌సెటిల్డ్ భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను చాలా కాలం క్రితమే రైతులు ఇతరులకు విక్రయించారు. అయితే అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో అప్పట్లో భూములు కొన్నవారు నాన్ డాక్యుమెంట్‌లో రాసుకున్నారు. దీంతో భూమి సాగుచేసుకుంటున్నా భూయాజమాన్య హక్కులు పొందలేకపోయారు. అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారాలు కాకపోవడం, అసలైన పట్టాదారుడు లేకపోవడం వంటి కారణాలతో 50 ఎకరాల భూములు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగానే ఉన్నాయి. ఈ భూములపై కన్నేసిన కొందరు అసలైన భూ యజమానుల స్థానంలో నకిలీ వ్యక్తులను తెరపైకి తీసుకువచ్చి భూపరిహారం కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ కీలక వ్యవహారంలో తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే ఇద్దరు అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

విచారణ తరువాతే పరిహారం



టేకులోడు గ్రామంలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో నిజమైన భూ యజమానులకే ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. 600 ఎకరాల భూసేకరణలో 50 ఎకరాల వరకు అన్‌సెటిల్డ్‌గా ఉన్నాయి. వాటికి సంబంధించి పూర్తి విచారణ చేపట్టాం. ఎవరు నిజమైన భూయజమాని అనే విషయాలను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తరువాతే పరిహారానికి ఆమోదం తెలుపుతాం. అన్‌సెటిల్డ్‌గా ఉన్న భూములకు సంబంధించి రైతులు తమ వద్ద ఉన్న రికార్డులను తీసుకువస్తే పరిశీలన జరిపి, వారు నిజమైన భూహక్కుదారులా కాదా అనే విషయాలను నిర్ధారణ చేస్తాం. చేపట్టిన భూసేకరణలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా పరిశీలిస్తున్నాం. సమస్యలు లేని 200 ఎకరాలకు ఇప్పటి వరకు పరిహారం అందజేశాం. గతంలోలా అవకతవకలు జరగకుండా పారదర్శకంగా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

-నటరాజు, తహసీల్దార్, చిలమత్తూరు మండలం

యువతే వికసిత్ భారత్ నిర్మాతలు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియా



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యువతే వికసిత్ భారత్-2047 నిర్మాతలని ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియా పేర్కొన్నారు. కళాశాలలో 'యువ కనెక్ట్ ప్రోగ్రాం' పేరుతో మంగళవారం సదస్సును నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పరదేశినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ప్రిన్సిపాల్‌తో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఆత్మారాం, వైస్ ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ శంకర్, మధుసూదన్, సమన్వయకర్త డాక్టర్ వరదరాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారతదేశమన్నారు. దేశాభివృద్ధికి యువత ఆలోచనలే పెట్టుబడి అని పేర్కొన్నారు. 2047కు వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దగలమన్నారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సుమన గోపీచంద్, ప్రొఫెసర్లు దుర్గ, సరళ, సురేష్, ఉమామహేశ్వరమ్మ, అసిసోసియేట్ ప్రొఫెసర్లు పద్మశ్రావణి, పూర్ణచంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చైతన్య, నీరజ, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహనాయక్ పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అధికారులు, కమిటీ సభ్యులు హాజరు కావాలన్నారు. ఈమేరకు అజెండా తయారు చేసి కమిటీ సభ్యులు, స్థాయి సంఘ సభ్యులకు సర్క్యులేట్ చేసినట్లు తెలిపారు. ఆర్థిక, ప్రణాళిక స్టాండింగ్ కమిటీ-1, అభివృద్ధి పనులు స్టాండింగ్ కమిటీ -7, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ-2, విద్య, వైద్య సేవలు స్టాండింగ్ కమిటీ-4, సమావేశాలు జడ్పీ మెయిన్ హాల్‌లో నిర్వహిస్తారన్నారు. మహిళ, శిశు సంక్షేమము స్టాండింగ్ కమిటీ-5, వ్యవసాయం స్టాండింగ్ కమిటీ-3, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ-6 సమావేశాలు జడ్పీలోని అదనపు సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన సెక్టోరల్స్ ఇంటర్వ్యూలు

- 47మందికిగాను 42మంది హాజరు

అనంతపురం విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఫారిన్ సర్వీస్ కింద పనిచేసే సెక్టోరల్స్ నియామకాలకు ఇంటర్వ్యూలు ముగిశాయి. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన 47మంది టీచర్లను ఎస్ఎస్ఏ అధికారులు ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్వ్యూలు ప్రారంభించారు. తొలిరోజు 25మందిని ఆహ్వానించగా 22మంది హాజరయ్యారు. రెండోరోజు 22మందిని ఆహ్వానించగా 20మంది హాజరయ్యారు. ఈలెక్కన మొత్తం 47మందికి గాను 42మంది టీచర్లు సెక్టోరల్స్ ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఏపీసీ శైలజ తెలిపారు. అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ హాజరైన టీచర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఎంపిక ప్రాధాన్యంపై టెన్షన్

గతంలో సెక్టోరల్స్ పోస్టులకు హెచ్ఎంలు, ఎంఈఓలను, అసిస్టెంట్ సెక్టోరల్స్‌గా స్కూల్ అసిస్టెంట్‌లను తీసుకునేవారు. గత వైసీపీ ప్రభుత్వం కేవలం స్కూల్ అసిస్టెంట్‌లకే అవకాశం కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వంలో స్కూల్‌అసిస్టెంట్‌లతో పాటు ఎస్టీటీలకు అవకాశం కల్పించింది. ఇంటర్వ్యూలు ముగియడంతో ఎంపికలో స్కూల్‌అసిసెంట్‌లకు తొలిప్రాధాన్యం ఇస్తారా, లేదంటే అందరి పాయింట్లు పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేస్తారా అన్నదానిపై అభ్యర్థులలో టెన్షన్ మొదలైంది. ఇపుడు జరిగిన ఇంటర్వ్యూలలో దాదాపు 15మంది ఎస్టీటీలు కూడా ఉన్నారు. ఈ పరిస్థితులలో ఎంపిక ప్రక్రియ ఎలా అనేదానిపై అభ్యర్థులలో సందిగ్ధత కొనసాగుతోంది.

కసాపురం ఆలయ ట్రస్టుబోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

గుంతకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ధర్మకర్తగా సేవలందించడానికి ఆసక్తి కలిగినవారు ఈనెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ ఎం విజయరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వును నోటీసు బోర్డులో ఉంచామని, పూర్తి వివరాలను దేవస్థానంలో తెలుసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు తగిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి దేవస్థానంలో అందజేయాలన్నారు.

ఫ్లైయాష్‌ను ఉచితంగా ఇవ్వాలి

- లోక్‌సభలో ఎంపీ అంబికా



అనంతపురం క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇటుకల తయారీకి ఫ్లైయాష్‌ను ఉచితంగా అందించే విధానం తేవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఆయన లోక్‌సభలో మంగళవారం మైన్స్ అండ్ మినరల్స్ సవరణ బిల్లు-2025పై మాట్లాడారు. గత పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశం గనుల రంగంలో బలమైన , స్థిరమైన వృద్ధిని సాధించిందన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో రాష్ట్ర గనుల రంగం తీవ్రంగా వెనుకబడిందన్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఖనిజ, ఇసుక అక్రమ రవాణా వల్ల వేల కోట్ల నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర జీడీపీలో గనుల రంగం వాటా 3.5 శాతం నుంచి 2.7 శాతానికి పడిపోయిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వచ్చాక మైనర్ మినరల్ పాలసీ 2025 తీసుకొచ్చాక గనుల రంగానికి కొత్త ఊపిరి వచ్చిందన్నారు. బిల్లులో రెండు సవరణలు చేయాలని సూచించారు. క్లింకర్, ఫ్లైయాష్ మిశ్రమాన్ని సిమెంట్‌కు ప్రత్యామ్నాయంగా అమ్మడం వల్ల నాణ్యత సమస్యలు వస్తాయన్నారు. తర్వాత బిల్లుకు పూర్తిగా మద్దతు ప్రకటించారు.

ఈసారీనేనా..?

- నేడు రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక

రామగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక బుధవారం జరగనుంది. ఎంపీపీ ఉప ఎన్నికకు సంబంధించి అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10గంటల నుంచి12గంటల లోపు సభ్యులు హాజరై ఎంపీపీ ఎన్నిక నిర్వహించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే మూడుసార్లు ఎన్నిక వాయిదా పడుతూ వచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఇప్పుడు నాలుగోసారి నోటిఫికేషన్ విడుదలైనా వైసీపీ సభ్యులు అందుబాటులో లేరు. టీడీపీకి ముగ్గురు సభ్యులుండగా మిగిలిన ఆరుగురు వైసీపీ సభ్యులే. టీడీపీకి ఉన్న సభ్యులలో కూడా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారే ఇద్దరు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వుకావడంతో మహిళా సభ్యులు టీడీపీ వైపు లేరు. దీంతో ప్రతి సారి వైసీపీ సభ్యులు గైర్హాజరు కావడం, ఎన్నిక వాయిదా పడటం జరుగుతోంది. ఈసారి కూడా వైసీపీ సభ్యులు ఎన్నికకు వచ్చేది అనుమానమే. వైసీపీ వర్గాలు తాము ఎన్నికకు రామని బాహాటంగానే చెబుతున్నాయి. కాగా ఎంపీపీ ఉప ఎన్నికకు ఇద్దరు డీఎస్పీలు, సీఐలు ఆరుగురు, ఎస్ఐలు ఏడుగురు, పీఎస్ఐలు ఆరుగురు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 34 మంది, పోలీసులు 56 మంది, ఏపీఎస్పీ ప్లటూన్ 1, స్పెషల్ పార్టీ 2 బందోబస్తు చర్యలు చేపట్టినట్టు సీఐ శ్రీధర్ తెలిపారు. ఎన్నికల అధికారి సంజీవయ్య, ఎంపీడీఓ గంగావతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పోలీసు సిబ్బందికి బందోబస్తుపై సూచనలు ఇస్తున్న రామగిరి సీఐ

ఆగని వాన

అనంతపురం అర్బన్/కొత్తచెరువు/విడపనకల్లు/కూడేరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వరుస వర్షాలు కొనసాగుతున్నాయి. పలు మండలాల్లో సోమవారం రాత్రి వాన పడింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.



విడపనకల్లు మండలం మాళాపురం వద్ద కంది చేనులో నిల్వ ఉన్న నీరు

ఉద్యాన పంటలకు నష్టం

గుంతకల్లు, కంబదూరు, కూడేరు, విడపనకల్లు, రాప్తాడు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, గుంతకల్లు, గుత్తి, కంబదూరు మండలాల్లో ఉల్లి, పచ్చిమిరప, అరటి, టమోటా పంటలు దెబ్బతిన్నాయి. కూడేరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర సాగు చేసిన టమోటా పంట దెబ్బతింది. వర్షానికి కాయలు రాలిపోయాయి. విడపనకల్లు మండలంలో కంది చేలలోకి నీరు చేరడంతో పంట దెబ్బతింది. పొలికి అంచనహాలు పెద్దవంక ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. విడపనకల్లు-ఆర్ కొట్టాల, పాల్తారు-గోవిందవాడ, ఉండబండ-ఉరవకొండ వంకలు జోరుగా ప్రవహించాయి.



కుళ్లిపోయిన టమోటా కాయలను చూపుతున్నరైతు నాగేంద్ర

వజ్రకరూరులో భారీ వర్షం

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా వజ్రకరూరులో 4.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కూడేరు 3.5, బెళుగుప్ప, ఆత్మకూరు, ఉరవకొండ 3.2, బుక్కరాయసముద్రం 2.8, అనంతపురం 2.0, బొమ్మనహాళ్ 1.6, రాప్తాడు 1.5, గార్లదిన్నె, నల్లచెరువు 1.2, పెద్దవడుగూరు, విడపనకల్లు 1.1, పుట్టపర్తి 1.0 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.0 సెంటీ మీటర్లలోపు వర్షపాతం నమోదైంది. మంగళవారం బెళుగుప్పలో ఓ మోస్తరు వర్షం, గుత్తి, తాడిపత్రి, యాడికి, పుట్లూరు, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.



కూడేరు మండలంలో వర్షానికి దెబ్బతిన్న టమోటా పంట

ప్రజలకు జీవనోపాధి కల్పించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కదిరి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పీ4తో ప్రజలకు జీవనోపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా మహాసభలను మంగళవారం స్థానిక బడా సుబ్బిరెడ్డి, కోలా రామాంజనేయుల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మార్గదర్శకులను తీసుకొచ్చి బంగారు కుటుంబాలు ఎంపికచేసి సాయం చేయాలని చెప్పడం కంటే, వారికి జీవనోపాధులు కల్పిస్తే బాగుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం ఇవ్వాలన్నారు. నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో 3 మాత్రమే అమలు చేశారన్నారు. మిగిలిన మూడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా మహిళలు, పురుషులను గుర్తించడానికి ఆధార్‌కార్డు ఎందుకని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ.. ఎన్నికల కమిషన్‌ను తనజేబు సంస్థలా వాడుకుంటోందన్నారు. దొంగ ఓట్లు వేయించుకోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, జిల్లా నూతన కార్యదర్శి రామక్రిష్ణ, నేతలు జీఎల్ నరసింహులు పాల్గొన్నారు.



జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన రామక్రిష్ణ

మొదటి మహిళా లోకో పైలెట్‌కు ప్రశంస

గుంతకల్లు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లోకోపైలెట్‌గా ప్రమోషన్ సాధించి, గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తొలి మహిళా లోకో పైలెట్‌గా రికార్డు సృష్టించిన అమలా కుమారికి డీఆర్ఎం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో సహాయ లోకోపైలెట్‌గా 44 మంది మహిళలు విధులను నిర్వర్తిస్తున్నారు. లోకో పైలెట్‌గా ట్రైనింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసి రైలును స్వతంత్రంగా నడప డానికి అర్హతను సాధించారు. దీంతో ఆమెకు లోకోపైలెట్‌గా ప్రమోషన్ లభించింది. ఈ కారణంగా అమలాకుమారి గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తొలి మహిళా లోకోపైలెట్‌గా గుర్తింపు పొందారు. మంగళవారం తన కార్యాలయానికి రప్పించిన డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అమలా కుమా రికి ప్రశంసలందజేసి, ఆఫీసు ఆర్డరును అందజేశారు. విధినిర్వహణలో నిబద్ధత చాటినందుకు, తొలి మహిళా లోకో పైలెట్‌గా గుర్తింపు పొందినందుకు అభినందించారు. లోకో పైలెట్‌గా ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఈ (టీఆర్ఎస్ఓ-జీటీఎల్) సీ వీరయ్య, డీపీఓ (కో-ఆర్డినేషన్) హెచ్ ఎల్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే సెక్షన్‌ను పరిశీలించిన డీఆర్ఎం

గుంతకల్లు-ఖాదర్‌పేట్-కల్లూరు రైల్వే సెక్షన్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఉదయం తనిఖీచేశారు. ప్రత్యేక రైలులో రీర్ విండో ద్వారా ట్రాక్ పటిష్టతను పరిశీలించారు. సమస్యాత్మకంగా ఉన్న ట్రాక్ ప్రదేశాన్ని గుర్తించి ఫిట్నెస్ కల్పించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మార్గంలో ట్రాక్ వంకరగా ఉన్న చోట్ల పరిస్థితిని అంచనా వేశారు. కార్యక్రమంలో డీఆర్ఎంతోపాటు ఏడీఆర్ఎం సుధాకర్, సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.



అమలా కుమారికి ఆఫీసు ఆర్డర్ అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

బియ్యం మొత్తం సీజ్ చేస్తాం

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు
- రేషన్ బియ్యం దందాపై పూర్తి వివరాలు వెల్లడించని అధికారులు



రెండోరోజు బియ్యాన్ని గోడౌన్‌కు తరలిస్తున్న దృశ్యం

యాడికి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం మొత్తం సీజ్ చేస్తామని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మిల్లులోని రేషన్ బియ్యంను సివిల్ సప్లై గోడౌన్‌కు తరలింపును ఆయన మంగళవారం పర్యవేక్షించారు. మిల్‌లో రేషన్ బియ్యం నుంచి తీసిన సన్నబియ్యంను పరిశీలించారు. ఎంత మొత్తంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారు, ఇంతవరకు ఎన్ని టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్‌సప్లై గోడౌన్‌కు తరలించారు అనే విషయాలను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సివిల్ సప్లై డిప్యూటి తహసీశీల్దార్ మల్లేష్‌తో ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులోని మొత్తం బియ్యాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. మిల్లులోని బియ్యం రేషన్ బియ్యం అనడానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయని ఆయన తెలిపారు. వీటన్నింటిపై నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెండోరోజు రేషన్ బియ్యం తరలింపు

మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం తరలింపు రెండో రోజు కొనసాగింది. సీఐ ఈరన్న, సీఎస్‌డీటీ మల్లేష్ రేషన్ బియ్యం తరలింపును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మూడులారీల్లో రేషన్ బియ్యంను గుంతకల్లులోని సివిల్‌సప్లై గోడౌన్‌కు మంగళవారం తరలించారు. సుమారు 300టన్నుల బియ్యాన్ని గోడౌన్‌కు తరలించినట్లు చర్చించుకుంటున్నారు. అయితే దీనిపై కచ్చితమైన వివరాలను అధికారులు వెల్లడించలేదు. రేషన్‌బియ్యం దందాపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించడానికి ఒకటిరెండు రోజులు పట్టే అవకాశం ఉంది.

సర్వత్రా చర్చ

మిల్లులో సుమారు 300టన్నుల రేషన్ బియ్యం ఎలా నిల్వ ఉంచారు. ఈ నిల్వలపై అధికారులకు సమాచారం లేదా? ఇదంతా ఒక గుడాపుఠాణిలా సాగుతోందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. రేషన్ బియ్యం వ్యాపారంలో కొందరు నాయకులు తమకు వాటాలు కావాలని మిల్ ఓనర్‌తో వాదనకు దిగారని, దానికి ఆయన ససేమిరా అనడంతోనే ఈ గూడు పుఠాణి వెలుగులోకి వచ్చిందంటూ చర్చించుకుంటున్నారు.

రైస్‌మిల్ సీజ్

యాడికి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసిన మిల్‌ను మంగళవారం రాత్రి పోలీసులు, సివిల్‌సప్లై అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లులోని రేషన్ బియ్యం అన్నింటిని గుంతకల్లు సివిల్‌సప్లై గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు. పూర్తివివరాలను తొందరలోనే వెల్లడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాడికి సీఐ ఈరన్న, సివిల్‌సప్లై డిప్యూటి తహసీల్దార్ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.



రైస్‌మిల్‌ను సీజ్‌చేస్తున్న పోలీసులు, పౌరసరఫరాల అధికారులు

స్వాతంత్ర్య వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం


భరత్‌కుమార్

గుత్తి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు మండలంలోని వెంగన్నపల్లి సర్పంచ్ భరత్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానపత్రం పంపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో మెరుగైన పనితీరు కనబరచిన సర్పంచ్‌లు రాష్ట్రవ్యాప్తంగా పది మందిని ఎంపిక చేశారు. వారి భరత్‌కుమార్ కూడా ఉన్నారు. దీంతో ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

బొందలవాడ సర్పంచ్‌కు రాజ్‌భవన్ పిలుపు


ఆలం శిరీషా

నార్పల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ సర్పంచ్ ఆలం శిరీషకు అరుదైన గౌరవం దక్కింది. గతంలో జడ్పీటీసీగా, ప్రస్తుతం సర్పంచ్‌గా ఆమె చేసిన సేవలను గుర్తించి, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనాలని రాజ్‌భవన్ వర్గాలు కోరాయి. రాజ్‌భవన్ ఆహ్వానం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకురాలికి..


విష్ణుప్రియ

అనంతపురంరూరల్, (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు విష్ణుప్రియకు రాష్ట్ర రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. మంగళవారం గవర్నర్ కార్యాలనుంచి ఉత్తర్వులు వచ్చినట్లు విష్ణుప్రియ పేర్కొన్నారు. రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఆమె సేవలను గుర్తించి, ఈ అవకాశం కల్పించారు. దీంతో అధ్యాపకురాలు విష్ణుప్రియ ఆనందం వ్యక్తం చేశారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన పాఠశాలల నుంచి క్రీడాప్రతిభా అవార్డులు 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ క్రిష్టప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రదర్శనలు మాత్రమే ఎంపికకు పరిగణనలోకి తీసుకుంటారన్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని అన్ని పాఠశాలల మేనేజ్‌మెంట్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సర్టిఫికెట్‌లు హెడ్‌మాస్టర్, పీఈటీ, పీడీ సంతకాలతో జిరాక్స్ కాపీలను సమర్పించాలన్నారు. టీం ఈవెంట్స్, వ్యక్తిగత ఈవెంట్స్ పాయింట్‌లను పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. ప్రతిక్రీడలో అత్యధిక స్కోర్ సాధించిన పాఠశాలలు , స్కోర్ అగ్రస్థానంలో ఉన్న పాఠశాలలను అవార్డులకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. డీఈఓ అధ్యక్షతన ఐదుగురు సభ్యుల గల కమిటీ ద్వారా దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. ఎంపికైన ఐదు పాఠశాలలకు జాతీయ క్రీడాదినోత్సవం ఆగస్టు 29న అవార్డులు అందజేస్తామని తెలిపారు.

హెచ్‌ఐవీ నివారణపై విస్తృత ప్రచారం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, సుఖవ్యాధుల నియంత్రణ, మాదక ద్రవ్యాల వినియోగ చెడు ప్రభావాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ పర్యవేక్షకులు జీవీ రమణ అధ్యక్షతన మంగళవారం ఆమె పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ సర్కిల్, జడ్జి బంగ్లా వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి ఓబులు, ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ పర్యవేక్షకులు మురళీమోహన్, రైడ్స్ క్రిష్టప్ప, లింక్ వర్కర్ రమేష్, అనంత నెట్‌వర్క్ సిబ్బంది, ఎన్టీఓ మేనేజర్లు నరేష్, మహేష్, శ్రీనివాసరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రమేష్, నీలకంఠ పాల్గొన్నారు.

డంప్‌పై దర్యాప్తునకు ఎస్పీ ఆదేశం...!

అనంతపురం క్రైం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాల డంప్‌పై ఎస్పీ జగదీష్ విచారణకు ఆదేశించారు. సమగ్రంగా విచారణ చేయాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు. ఆత్మకూరు మండలం వేపచెర్ల సమీపంలో కొండగుట్ట ప్రాంతంలో పేలుడు పదార్థాలున్నట్టు ఆత్మకూరు పోలీసులు గుర్తించారు. 90 డిటోనేటర్లు, 9ఎంఎం రౌండ్లు 70, ఐరన్‌బాల్స్ 20, వైట్ రబ్బర్ ఖాళీ కాక్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కొండగుట్ట ప్రాంతంలో భారీ స్థాయిలో పేలుడు పదార్థాల డంప్ బయటపడటంపై సంబంధిత పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డంప్ ఎవరు, ఎందుకు, ఎప్పుడు చేశారన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వీఆర్‌కు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్నం ఎస్‌ఐ రాజశేఖర్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రత్న మంగళవారం ఉత్వర్వులు జారీచేశారు. ఎస్‌ఐపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విచారణలో ఆరోపణలు రుజువైతే ఎస్‌ఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాయని ఎస్పీ తెలిపారు.

నెట్టికంటి స్వామికి వెండి రథ

ప్రాకారోత్సవం



గుంతకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా కసాపురంలోని శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారామ, లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాములకు వెండిరథంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. పూర్వాభాద్ర తిరునక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని ఆలయ యాగశాలలో మన్యసూక్త హోమాన్ని నిర్వహించారు. స్వామివార్ల చిత్రపటాలను ఉంచి, వేదపండితులు హోమం చేశారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఆశీనులు చేసి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకుడు రాఘవాచారి, వేదపండితుడు రామకృష్ణావధాని పాల్గొన్నారు.

వెండి రథంపై స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు

ఎరుపెక్కిన అనంత

అట్టహాసంగా సీపీఐ జిల్లా మహాసభలు ప్రారంభం
నగరంలో భారీ ర్యాలీ
అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించండి
: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



ర్యాలీ చేస్తున్న సీపీఐ రామక్రిష్ణ, అక్కినేని వనజ ఇతర నేతలు

అనంతపురం విద్య, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): అనంత వీధులు ఎరుపెక్కాయి. వందలాది మంది సీపీఐ శ్రేణుల ర్యాలీతో రోడ్లు ఎర్ర రంగును పరచుకున్నాయి. సీపీఐ జిల్లా మహాసభలు మంగళవారం నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సీపీఐ శ్రేణులు, కళాకారులు నృత్యాలు చేస్తూ, ఎర్రజెండాలను చేతబూని ర్యాలీ చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా కేఎస్‌ఆర్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద వరకు సాగారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ.. ధైర్యంగా మాట్లాడేవాడే కమ్యూనిస్టు అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా ఎర్రజెండా అక్కడ పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయనీ, అందరూ ముందుకొచ్చి అన్యాయాలు, అక్రమాలపై ధైర్యంగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్ తరహాలోనే కూటమి పాలన సాగుతోందన్నారు. జగన్ ఇంట్లో కూర్చుని బటన్లు నొక్కుతూ పాలన మరచిపోవడంతో ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబుకు ఊహించని విధంగా 164సీట్లు రావడంతో ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఎమ్మెల్యేల అరాచకాలు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో రాజకీయాలు దారుణంగా తయారయ్యాయన్నారు. ప్రజల కోసం కాకుండా కేవలం స్వార్థం కోసం అధికారంలోకి రావడానికి కుట్రలు పన్నుతూ పార్టీలను దెబ్బతీస్తున్నాయన్నారు. ఇలాంటి స్వార్థ నేతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్ర నేతలు జగదీష్, రామాంజనేయులు, జాన్సన్ బాబు, జిల్లా నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, సంజీవప్ప, రాజారెడ్డి, కేశవరెడ్డి, శ్రీరాములు, గోపాల్, రామకృష్ణ, లింగమయ్య, రమణయ్య, పద్మావతి, రంగయ్య, సంతోష్, చిరంజీవి, రాజేష్, నాగరాజు, కళ్లాయిస్వామి, చెన్నప్ప, వందలాదిమంది సీపీఐ శ్రేణులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

కేంద్ర మంత్రి సోమణ్ణకు టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం వినతి


కేంద్ర మంత్రి సోమణ్ణను కలిసిన టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం

అనంతపురం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రైల్వే సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్నను టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఆయన సోదరుడు పరిటాల సిద్ధార్థ కలిశారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171-600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లెవెల్ క్రాసింగ్ గేటు ఏర్పాటు చేయకపోవడం మూలంగా ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవలే కేతిరెడ్డి కాలనీ వద్ద ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో వెంటనే అక్కడ లెవెల్ క్రాసింగ్ గేటుగానీ, ఫుట్ ఓవర్ బ్రిడ్జిగానీ ఏర్పాటు చేయాలని కోరారు. తమ ప్రాంత ప్రజలు తిరుపతికి వెళ్లేందుకు తీవ్ర వ్యవప్రయాసాలు పడుతున్న నేపథ్యంలో రామగిరి మార్గంలో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అనంతపురంలోని రాంనగర్, నాయక్‌నగర్‌లోని రైల్వే లైన్ క్రాస్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించాలని కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి చేశారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామిని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కలిశారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనపై చర్చించారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు అత్యంత అనువుగా రవాణా మార్గం ఉన్న ఉమ్మడి అనంత జిల్లా పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతమని కేంద్ర మంత్రికి వివరించారు. భూములు అధికంగా ఉన్న నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు పరిశీలిస్తామని కేంద్ర మంత్రి.. ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్
విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, పక్కన డీఎంహెచ్‌ఓ, ఐసీడీఎస్ పీడీ

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ అగస్టీన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నులిపురుగుల (ఆల్బెండజోల్) నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆహారాన్ని తీసుకునే ముందుగా చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. విస్మరిస్తే గోళ్లలోని బ్యాక్టీరియా పొట్టలోకి చేరుకుని నులిపురుగుల నివాసానికి ఆవాసంగా మారుతుందని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల శుభ్రతను పాటించేలా తగిన సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌డీడీ స్టేట్ నోడల్ ఆఫీసర్లు నరేష్, నాగేంద్ర మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవడం ద్వారా నులిపురుగులు నశిస్తాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసుగల 599852మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, ఎంఈఓ వెంకటస్వామి, స్కూల్ హెడ్‌మాస్టర్ సుజాత, వైద్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ రోహిత్ నాయుడు, డెమో త్యాగరాజు, హెచ్ఈఓ గంగాధర్, ఎంహెచ్‌ఓలు రంగస్వామి, జగదీష్, మేనేజర్ రజిత, సైకాలజిస్ట్ సుందర్‌రావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు పరేడ్ పరిశీలన


మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

అనంతపురం క్రైం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌ను ఎస్పీ జగదీష్ మంగళవారం పరిశీలించారు. సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. సమర్థవంతంగా పరేడ్ నిర్వహించేలా సాయుధ బలగాలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతీయ సమైక్యత, దేశభక్తి భావం వెల్లివిరిసేలా పరేడ్ నిర్వహించాలన్నారు. ఏఆర్ సాయుధ బలగాలతోపాటు డాగ్‌స్క్వాడ్, ఎన్‌సీసీ విద్యార్థులు సైతం ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక చేశారు. ఎంపికైన జట్ల వివరాలను స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి మంగళవారం ప్రకటించారు. ఎంపికైన జట్లు ఈనెల 14 నుంచి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జరిగే 10వ ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొంటాయన్నారు.

బాలుర జట్టు: మనీష్, సంతోష్, సంజయ్‌రెడ్డి, చైత్రేష్, మనోజ్‌కుమార్, విజయ్, రాహిల్, సాయిహర్ష, లక్ష్మీనరసింహ, కౌషిక్, కరీం, ఖాజా ఎంపికయ్యారు. కోచ్‌గా అఫాశ్‌ఖాన్ నియమితులయ్యారు. బాలికల జట్టు: సోహానా, యామిని, నిక్కీశ్రీ, వైష్ణవి, పల్లవి, కిరణ్మయి, ధన్వి, పరిమళ, అజున, యశశ్వని, శ్రావణి, హర్షిత ఎంపికయ్యారు. కోచ్‌గా నరేంద్ర కృష్ణ నియమితులయ్యారు.

మున్సిపల్ ఆర్డీగా నాగరాజు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ)గా నాగరాజు నియమితుడయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర మున్సిపల్ డైరెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయ అడిషినల్ డైరెక్టర్‌గా ఉన్న నాగరాజును అనంతపురం ఆర్డీగా నియమిస్తూ బదిలీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న విశ్వనాథ్‌ను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న రవీంద్రబాబును ఇక్కడికి బదిలీ చేసినా ఆయన చేరలేదు. దీంతో నాగరాజును అనంతపురం ఆర్డీగా బదిలీ చేశారు. ఇంతకు మునుపు నాగరాజు అనంత నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేశారు. రెండు, మూడు రోజుల్లో ఆయన ఆర్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ. 17,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.8,500, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 510 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.45

అనంతపురం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం కిలో టామోటా లు గరిష్టంగా రూ.45తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్టంగా రూ.24, సరాసరిగా రూ.34తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రూ.70వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు


డబ్బులు పోగొట్టుకున్న బాధితులు

లేపాక్షి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రూ.70వేలు కాజేసిన సంఘటన సోమవారం లేపాక్షిలో జరిగింది. బాధితులు ఇస్మాయిల్, రహమతి తెలిపిన మేరకు ఒక తెలియని నంబరు నుంచి మధ్యాహ్నం 3గంటల సమయంలో ఓ వ్యక్తి ఫోన్‌చేసి 'తాను ప్రభుత్వ అధికారిని అని, వెలుగు సంస్థ నుంచి మాట్లాడుతున్నానని, మీరు డ్వాక్రాలో తీసుకున్న వడ్డీ రుణం రూ.40వేలు మీ ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మీ ఫోన్‌పేలో బ్యాలెన్స్ ఎంతుంది' అని అడిగాడు. ఇది నిజమని నమ్మి రూ.70వేలు ఉందని ఇస్మాయిల్ తెలిపాడు. మేము వడ్డీ డబ్బు ఖాతాలో జమ చేస్తున్నామని ఫోన్‌పే ఓపెన్ చేయమని అడిగాడు. నిజమని నమ్మి ఫోన్‌పే తెరిచాడు. అతను చెప్పిన విధంగా బ్యాలెన్స్ చెక్ చేసి, గంటను నొక్కాడు. దీంతో రూ.44,490 కట్ అయింది. మళ్లీ ఒకసారి గంటను నొక్కగా రూ.17,103 కట్ అయింది. మూడోసారి రూ.8,201కట్ అయింది. మీ ఖాతాలో మొత్తం డబ్బు రేపు జమ అవుతుందని చెప్పి సైబర్ నేరగాడు కాల్ కట్ చేశాడు. అనుమానంతో బాధితులు తిరిగి అదే నంబరుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. మోసపోయామని గ్రహించిన బాధితులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. బాధితులు లేపాక్షిలో ఫుట్‌పాత్‌మీద బండిలో దోసెలమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దంపతులకు నలుగురు ఆడపిల్లలు. ఇంటి మరమ్మతుల కోసం డ్వాక్రాలో లోన్ తీసుకుని ఖాతాలో పెట్టుకున్నామని, ఇలా మోసంతో మా సొమ్ము కాజేస్తారా అని భార్య భర్తలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గంజాయి విక్రేత పరారీ

కదిరిఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో గంజాయి విక్రేత పరారైన సంఘటన మండలంలోని సున్నపుగుట్టతండాలో మంగళవారం జరిగింది. గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నట్లు గ్రామస్థుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు గ్రామానికి బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న గంజాయి విక్రేత షామీర్ పరారయ్యాడు. గ్రామంలో షామీర్ గంజాయి విక్రయిస్తు, సేవిస్తూ గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్నాడని, పిల్లలు, మహిళలు తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఉందని పలువురు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నీరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులు ఫోన్ చేయడంతో తమ సిబ్బంది గ్రామానికి వెళ్లే లోపు అతను పారిపోయాడన్నారు. అతను గంజాయిని మద్యంగా భ్రమించి సేవిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారన్నారు. పరారైన షామీర్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సేవాఘడ్ గురుకులంలో ప్రవేశాలు

అనంతపురం విద్య, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం గొల్లలదొడ్డిలో ఉన్న సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేశాఖ డీడీ శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతులతోపాటు ఇంటర్‌లో సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీడీ కోరారు.

సింగిల్‌విండో ఛైర్మన్ల ఎంపిక ఎప్పుడో..?

● జాబితా పంపడంలో నాయకుల అలసత్వం ● ధర్మవరం నియోజకవర్గంలో ఆశావహుల ఎదురుచూపు

ధర్మవరంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు (పీఏసీఎస్)కు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్‌విండో ఎన్నికల జరిగే వరకు తాత్కాలికంగా త్రిసభ్య కమిటీలను నియమిస్తోంది. ఇందులో చైర్మన్, ఇద్దరు డైరెక్టర్లతో భర్తీ చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు ఒక్కో సొసైటీకి ఒకరు చైర్మన్, ఇద్దరు డైరెక్టర్లతో కూడిన జాబితాను జిల్లా సహకార బ్యాంకు కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది. సత్యసాయి జిల్లాలో 54 సొసైటీలు ఉన్నాయి. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో సొసైటీల చైర్మన్ల ఎంపిక పూర్తయి ప్రమాణస్వీకారాలు చేస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గం ఈ ప్రక్రియ ఇంకా మొదలే కాలేదు. నియోజకవర్గంలో ఐదు సొసైటీలు ఉన్నాయి. వీటిలో ధర్మవరం మండలంలోని గొట్లూరు, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ వండలంలోని ముదిగుబ్బ, రాళ్ల అనంతపురంలో ఉన్నాయి. గతంలో ఉన్న కమిటీలు రద్దుచేయడంతో ప్రస్తుతం ఈ సొసైటీలకు అధికారులే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు.

జాబితా పంపించడంలో అలసత్వం

ధర్మవరం నియోజకవర్గంలో ఈసారి కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో సొసైటీల వద్దకు టీడీపీ వారు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ప్రభుత్వం రాగానే తమ గౌరవం కోసం పదవి వస్తుందనుకుంటే ఇక్కడ మాత్రం జాబితాను పంపించడంలో కూటమి నేతలు అలసత్వం వహిస్తున్నట్లు ఆయా పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్ల ప్రతిపక్షంలో టీడీపీ నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికే టీడీపీ నాయకులు ఆయా మండలాల నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పార్టీకోసం గత ఐదేళ్ల కష్టపడి పనిచేసిన వారికే తొలిప్రాధాన్యత ఇవ్వాలని నాయకుల వద్ద శ్రీరామ్ చర్చించినట్లు సమాచారం. వీటిలో బత్తలపల్లి, ముదిగుబ్బ మండలంలో బీజేపీకి ఒకటి ఇవ్వాలని, ధర్మవరం మండలం, తాడిమర్రి, ముదిగుబ్బ మండలంలో మరొకటి టీడీపీకి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది.



ధర్మవరం మండలం గొట్లూరులోని సొసైటీ కార్యాలయం

జాబితా అందలేదు..

ధర్మవరం నియోజకవర్గంలో ఐదు సొసైటీలకు గాను ఇప్పటి వరకు మాకు జాబితా రాలేదు. దీంతో ఆ నియోజకవర్గంలోని సొసైటీల ఎంపిక ప్రక్రియ ఇంకా జరగలేదు. జాబితా వచ్చిన వెంటనే ప్రతిపాదించి చైర్మన్లు, డైరెక్టర్ల ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తాం.

-కృష్ణానాయక్, డీసీఓ, శ్రీసత్యసాయి జిల్లా

'దేశభక్తిని చాటడమే హర్ ఘర్ తిరంగా లక్ష్యం'

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

సమాజంలో ప్రతిపౌరుడు దేశభక్తిని చాటిచెప్పడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పుట్టపర్తిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, కోఇన్‌చార్జి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండమరాజు, రాజారెడ్డి, బాలగంగాధర్, సునీల్‌షెట్టి, రామాంజనేయులు, గంగిశెట్టి, నారాయణ, లక్ష్మీనారాయణనాయక్, శివశంకర్‌రెడ్డి, రామాంజినేయనాయక్, నాగార్జునశెట్టి పాల్గొన్నారు. తాడిమర్రిలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు రాము, రమణ, సతీశ్, గోపాల్‌రెడ్డి, ఓబులేశు, చంద్ర పాల్గొన్నారు. ధర్మవరం మండలం పోతుకుంటలో మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీ‌శ్‌బాబు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాల, ప్రియదర్శిని పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ, నాయకులు నాగవేణి, రాజు, వెంకటేష్, చంద్ర, లక్ష్మీనారాయణ, భక్తవత్సలం, శ్యామరావు పాల్గొన్నారు. గాండ్లపెంటలో బీజేపీ నాయకులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఎంఈఓ క్రిష్ణానాయక్, బీజేపీ నాయకులు కేశవరెడ్డి, అశోక్, సిద్దారెడ్డి, బాబ్‌జాన్, ఆదర్శపాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున పాల్గొన్నారు. నల్లచెరువులో ర్యాలీ కొనసాగింది. తనకల్లులో బీజేపీ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాలు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. నాయకులు బాబురెడ్డి చంటి, రామమోహన్, గణేష్‌నాయక్, సురేంద్ర, భార్గవ్, జానకి, సురేష్, నరేష్, శంకర్‌రెడ్డి, సోము, లచ్చప్ప, రాజన్న, శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.


పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు

నల్లచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, అలంకరణ చేశారు.ఆలయం ఆవరణంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.


అలంకరణలో ఆంజనేయస్వామి

పట్నం ఎస్ఐగా బాధ్యతలు



ముదిగుబ్బ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జయరాంనాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజశేఖర్‌ను వీఆర్‌కు పంపారు. సత్యసాయి జిల్లా ఆఫీసు నుంచి వచ్చిన ఎస్ఐ జయరాం నాయక్ ఆ స్థానంలో బాధ్యతలు స్వీకరించారు.

గుండెపోటుతో యువకుడి మృతి

గాండ్లపెంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఓ టీ దుకాణంలో గుండెపోటుతో యువకుడు మృతిచెందిన సంఘట మంగళవారం గాండ్లపెంటలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన మేరకు.. కదిరి పట్టణం వలీసాబ్ రోడ్డులో నివాసాముంటున్న ఈసూఫ్ కుమారుడు దాదాపీర్ (23) ఓ ప్రైవేటు సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. దినచర్యలో భాగంగా గాండ్లపెంటకు వచ్చాడు. మండలంలో డెలివరీ చేసిన తరువాత ఓ దుకాణంలో టీ తాగడానికి వచ్చాడు. ఉన్నఫలంగా గుండెనొప్పివచ్చి కుర్చీలో కుప్పకూలిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

ద్విచక్రవాహనంలో పాము

నల్లచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ఇంటి బయట పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనంలో పాము ఉన్న సంఘటన చోటుచేసుకుంది. ప్రసాద్ అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని సోమవారం రాత్రి ఇంటి బయట పార్కింగ్ చేశాడు. మంగళవారం ఉదయం ద్విచక్రవాహనాన్ని బయటకు తీస్తుండగా డూమ్‌లైట్ కింద రంధ్రంలో పాము కనిపించింది. చుట్టుపక్కలవారి సాయంతో పామును వాహనం నుంచి తీసివేశారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

ధర్మవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద ఉన్న కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, పావని, హైమావతి, తాహీర్, పుష్ప, ఆనంద్, మీనా, ధనుంజయ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం

ధర్మవరంరూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుణుతూరు గ్రామంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రామపెద్దలు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కార్పెంటర్ రామాంజనేయలు స్వామికి పంచలోహలకవచాధారణ బహూకరించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా ఆకుపూజతో అలంకరించి విశేషపూజలు చేశారు.

జూడోలో జిల్లాకు పతకాలు

కొత్తచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ జూడో పోటీల్లో జిల్లావాసులు పతకాలు సాధించారని జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్‌నాయుడు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయిసబ్‌జూనియర్స్ జూడో క్రీడలలో 9 మంది బాలురు, 9 మంది బాలికలు పాల్గొన్నారన్నారు. ఇందులో 4 బంగారు పతకాలు, 3 వెండి పతకాలను, 8 బ్రాంచ్ మెడల్స్‌ను సాధించారన్నారు.


మెడల్స్ సాధించిన జూడో క్రీడాకారులు

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొడరాళ్లపల్లి బస్టాప్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలయిన సంఘటన చోటుచేసుకుందని స్థానికులు పేర్కొన్నారు. బుక్కపట్నం మండలం గనికవారిపల్లికి చెందిన చిన్నప్ప, గంగాధర ముదిగుబ్బలో పని ముగించుకొని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా పొడరాళ్లపల్లి బస్టాప్ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలయ్యాయని, ఇద్దరిని ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వీరిలో చిన్నప్ప పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.

పూరి గుడిసెలు, పాతమిద్దెల్లో ఉండొద్దు: ఎస్ఐ

తాడిమర్రి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు పూరిగుడిసెలు, పాతమిద్దెలలో ఉండవద్దని ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున మరువపల్లిలో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ గ్రామస్థులతో మాట్లాడుతూ...రాబోవు మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు.

ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

ధర్మవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ కాలనీలో వెలసిన మారుతీరాఘవేంద్రస్వామి ఆలయంలో గత నా లుగు రోజులుగా నిర్వహిస్తున్న 354 ఆరాధనోత్సవాలు మంగళవా రం ముగిశాయి. చంద్రప్రభ అలంకణలో రాఘవేంద్రస్వామి దర్శనమిచ్చారు.

పాఠశాల సీజ్

బత్తలపల్లి ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోనెక్స్ గ్లోబల్ పాఠశాలను సీజ్ చేసినట్లు ఎంఈఓ చాముండేశ్వరి తెలిపారు. పాఠశాలను ఎంఈఓ మంగళవారం తనిఖీ చేసి ప్రీప్రైమరీ తరగతులకు అనుమతులు లేనందున జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు.

పలు గ్రామాల్లో వర్షం

తాడిమర్రి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు, నారసింపల్లి, పుల్లప్పపల్లి, పూల ఓబయ్యపల్లితోపాటు పలు గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. దీంతో వర్షపు నీరు కొంత వరకు పొలిరెడ్డికుంటకు చేరింది. నిడిగల్లు గ్రామానికి ఇరువైపుల వంకలు నీటితోనిండి పారాయి. గ్రామ సమీపంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తీచేసుకున్న ఆజాది అమృత్‌సరోవర్ పూర్తిగా నీటితో నిండిపోయింది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు మంగళవారం పుట్టపర్తి డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ అయి, రెండు సంవత్సరాలు పూర్తయినా మధ్యంతర భృతిని ప్రకటించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రవితేజ, ఈశ్వరప్ప, నూరుమహమ్మద్, శివారెడ్డి, లక్ష్మీపతి, కళావతి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: ప్రభుత్వంలో విలీనమైన తరువాత ఆర్టీసీ ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌వీ రమణ పేర్కొన్నారు. స్థానిక డిపో ఎదుట ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు భైరిశెట్టి, రామక్రిష్ణ, రామమోహన్, మల్లికార్జున, ఇనయతుల్లా, రామచంద్ర, డీఎల్ నారాయణ, ఓబులేసు పాల్గొన్నారు.

● ధర్మవరం : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ జిల్లా చైర్మన్ ముత్యాలప్ప మాట్లాడుతూ... గత కొంతకాలంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు ఏఎస్ రావు, మోహన్, దుర్గాప్రసాద్, నాగప్ప, సాబ్, ప్రభాకర్, మధుసూదన్, కుమార్, హరి, వైవీఎన్ రెడ్డి, రాయుడు, ఎంఎం రత్నం, పీఎస్‌ఖాన్, మాధవ, ఎంసీజీరావు పాల్గొన్నారు.


పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్టీసీ డిపోల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు, కార్మికులు

న్యూస్ బాక్స్

'ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

నంబులపూలకుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలతో రోజురోజుకు ఉపాధ్యాయులపై బోధనేత భారం మోపుతున్నారని తెలిపారు. పాఠశాల ప్రారంభం నుంచి వివిధ యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, యోగాంధ్ర, మెగా తల్లిదండ్రుల సమావేశం, ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ, లీడర్‌షిపు ట్రైనింగ్‌లాంటి బోధనేతర పనులతో బోధనకు దూరమవుతున్నార ని, బోధన కుంటుపడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, శివయ్య, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రమణయ్య, వెంకటరమణారెడ్డి, పూర్ణానందరెడ్డి, రామమోహన్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశాలా ఫెర్రర్

నల్లమాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నం చేయాలని ఆర్డీటీ ఉమెన్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గంగాథియేటర్‌లో మం గళవారం ఆదర్శ మహిళ కోబ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో ముందు ఉండాలన్నారు. మహిళలు అనుకుంటే ఏదైనా సాధించగలరన్నారు. అందుకే మహిళ బ్యాంక్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ బ్యాంక్‌లో మహిళలు సులువుగా రుణాలు తీసుకుని, ఆదాయం పెంపొందిచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్, సాయిక్రిష్ణ, రఫీక్, మల్లికార్జున, శాంతమ్మ, రఘురాం పాల్గొన్నారు.

తనకల్లు మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా యోగి



తనకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తనకల్లు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా జనసేన పార్టీకి చెందిన ఎం. యోగిని ప్రభుత్వం నియమించింది. తనకల్లుకు చెందిన యోగి జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నారు. తన ఎంపికకు సహకరించినా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి



కదిరి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్ కిన్నెర సరస్వతమ్మ మంగళవారం మృతి చెందినట్లు ఆమె కుమారుడు, 7వార్డు కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ తెలిపారు. సరస్వతమ్మ కౌన్సిలర్‌గా ఐదేళ్ల పని చేశారు. అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె అం త్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుమారుడు తెలిపారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

రెండురోజులు నీటి సరఫరాకు అంతరాయం

కదిరి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఈనెల 13, 14 తేదీలో పట్టణ ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలగనున్నదని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్నపల్లి రిజర్వాయర్ నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం వల్ల నీటి సరఫరా ఇబ్బంది కలుగుతోందన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ధర్మవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 11, 2వ వార్డుల్లో 'మీ సమస్య- మాబాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వారు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముఖ్యంగా పింఛన్లు, గృహాలు, ఇంటి స్థలాలు ఇతర స మస్యలపై ప్రజల నుంచి అధికంగా అర్జీలు వచ్చాయి. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరిశే సుధాకర్, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పెద్దన్న, ప్రసాద్‌నాయుడు, చంద్ర, షరీఫ్, సనత్, రహీం, అస్లాం, లోకేశ్, ఇర్షాద్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్ రంగనాథన్ జయంతి

ధర్మవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని మంగళవారం స్థానిక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అంజలిసౌభాగ్యవతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రంగనాథన్ గురించి గ్రంథాలయ అధికారి పాఠకులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రాము, కేవీ సరస్వతమ్మ, రమణ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

బత్తలపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలోని మహత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో అక్రమాలకు పాల్పడుతున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు ప్రసాద్, నరేంద్ర, పోతలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వారు పాఠశాల వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్‌తో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమ వసూళ్లపై ప్రశ్నించగా.. ప్రభుత్వమే పాఠశాల అభివృద్ధి కోసం చెప్పిందని సమాధానం ఇచ్చారని తెలిపారు. ప్రతి విద్యార్థి నుంచి వేలల్లో అక్రమ వసూళ్లకు పాల్పడిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమయినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నందకిషోర్, గుణ, ఉమాకాంత్, గణేష్, మురళి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

ఎస్టీ గురుకుల కళాశాలను మార్చండి: ఎమ్మెల్యే


గురుకుల కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కదిరిలోని ఎస్టీ గురుకుల కళాశాలను తనకల్లుకు వారంలోపు మార్చాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణనాయుడుకు సూచించారు. మంగళవారం శివారు ప్రాంతాల్లో ఉన్న గురుకుల కళాశాలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అన్ని వసతులున్న గురుకుల కళాశాలను తనకల్లులో వదిలేసి, కదిరిలో అద్దె భవనంలో ఎందుకున్నారని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ తరువాత గురుకుల కళాశాల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తాను గుర్తించానని తెలిపారు. విద్యార్థినుల బాత్‌రూమ్‌లు కూడా బయటకు కనిపిస్తున్నాయని, ఇది చాలా దయనీయ పరిస్థితి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకపక్క శాశ్వత భవనాలు పెట్టుకుని మీ సౌలభ్యంకోసం కదిరిలో ఉన్నారని మండిపడ్డారు. వారంలోపు గురుకుల కళాశాలను తనకల్లుకు మార్చాలని సూచించారు.

తాగునీటి సమస్యపై కదిలిన యంత్రాంగం


పార్నపల్లి డ్యాం వద్ద పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ, నాయకులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ధర్మవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యపై యంత్రాంగం కదిలింది. 'ధర్మవరంలో తాగునీటి కష్టాలు..!' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో విద్యుత్, మున్సిపల్ అధికార యంత్రాంగం కదిలింది. మంగళవారం విద్యుత్‌శాఖ ఈఈ శివరామ్, ఏడీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, డీఈ వీరేశ్, కూటమి నాయకులు పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, హరీశ్‌బాబు, ఓబుళేశు, జింకాచంద్ర, మాధవరెడ్డి పార్నపల్లి డ్యాంను సందర్శించారు. అక్కడ విద్యుత్ సమస్యను పరిశీలించారు.మోటార్లకు సంబంధించిన సాంకేతిక లోపాలు తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేసి నిరంతరాయంగా తాగునీటిని అందించేలా తక్షణ పనులు చేపట్టారు. ట్రాన్స్‌కో ఈఈ మాట్లాడుతూ.. రెండు మూడు రోజుల్లో విద్యుత్ సమస్య పూర్తిగా పరిష్కరిస్తామన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


నల్లమాడలో పర్యవేక్షిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు సుబ్రహ్మణ్యం తదితరులు

నల్లమాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను రెడ్డిపల్లి సీహెచ్‌ఓ రామాంజులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని రాష్ట్ర అబ్జర్వర్ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మామణి, హెచ్‌ఇఓ రామచంద్ర, సూపర్‌వైజర్లు ప్రభావతి, ఎస్‌ఎం బాషా, సిబ్బంది ఉన్నారు.

● నల్లచెరువు : మండలపరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యాధికారి కల్పనరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

● బుక్కపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సురేష్ నులిపురుగుల వల్ల కలిగే నష్టలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ అధికారి ఓబులేసు పాల్గొన్నారు.

బోరు వేయించిన ఎమ్మెల్యే

కొత్తచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక బీసీ కాలనీ సమీపంలోగల ఎల్-2 లే ఔట్‌లో బోరు వేయించడానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి నిధులు మంజూరు చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం టీడీపీ నాయకులు స్థానిక సర్పంచ్ బోరు వేయించారు. ఈఏడాది జనవరి 27న ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరమే ఆయుధంగా పరిష్కారమే అజెండా'గా కార్యక్రమాన్ని స్థానిక జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఇందులో ఎల్-2లోని ప్రజలు తాగునీటి సమస్య తీర్చాలంటూ ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బోరు వేయడానికి నిధులు మంజూరు చేయడంతో హిందూపురం పార్లమెంట్ అధికారప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ ఓలిపి శ్రీనివాసులు,నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, పెద్దన్న, సర్పంచ్ భర్త నాగరాజు దగ్గరుండి బోరు వేయించారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను వెంకటాపురం ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి నిలదీశారు. మంగళవారం ఎంపీపీ తుమ్మల ఫర్వీన్ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ప్రతినిధి ఈశ్వరయ్య మాట్లాడుతుండగా.. కదిరి, హిందూపురం ప్రధాన రహదారి గుంతలమయమయిందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎందుకు మరమ్మతులు చేయలేదని వారు ప్రశ్నించారు. అందుకు ఈశ్వరయ్య సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు సమావేశాలకు రావాల్సి ఉండగా, కిందిస్థాయి సిబ్బందిని పంపడంతో సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఆగ్రహించారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇళ్లవద్దే రేషన్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కొంతమంది ఎంపీటీసీలు చుట్టుపుచూపుగా సంతకాల పెట్టి సమావేశం నుంచి వెళ్లిపోవడం కనిపించింది. కొన్నిశాఖల అధికారులుకూడా ఆలస్యంగా హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ శివరాంప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ అంజనప్ప, ఏఓ ఇలియాజ్‌బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, హౌసింగ్ ఏఇ అరుణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 89 మంది ఎంపిక

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్తంగా మంగళకర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 89 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 165 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఇందులో 89 మంది వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యారు. ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ శివప్రసాద్ కంపెనీల ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లు అపాయింట్‌మెంట్ లెటర్లను అందచేశారు.

సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య

చిలమత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే ఆయాశాఖల అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పల్లెబాట నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని చాగలేరు గ్రామంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే పీఏ వీరయ్య, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించిన అనంతరం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బయప్ప, నాయకులు జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, శంకరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మంజు పాల్గొన్నారు.

అన్ని చెరువులకు నీరివ్వాలి

జలసాధన సమితి నాయకులు



మాట్లాడుతున్న జలసాధన సమితి నాయకులు

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు అనుసంధానం చేసి అన్ని చెరువులకు నీరివ్వాలని జలసాధన సమితినాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పిల్లకాలువలు ఏర్పాటుచేసి ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. చిలమత్తూరు గోరంట్ల మండలాల్లో హంద్రీనీవా కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు శ్రీనివాసులు, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, జమీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి

మున్సిపల్ చైర్మన్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టుశిక్షణ పొందితే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. మంగళవారం రహమత్‌పురంలో కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 144మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పది శిక్షణా కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారని వీరందరికీ సుమారు 5వేల కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేష్, మెప్మా అధికారి గంగులయ్య, నాయకులు విజయలక్ష్మీ, ఇలియాజ్, శ్రీనివాసనాయుడు, ఆదిల్, షఫీవుల్లా పాల్గొన్నారు.

పేరు మార్చడం దారుణం: జేడీఎస్



నిరవధిక దీక్ష చేస్తున్న జేడీఎస్ నాయకులు

పావగడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కుమారస్వామి లేఅవుట్‌గా ఉన్న ప్రాంతాన్ని వెంకటరమణప్ప లేఅవుట్‌గా నామకరణం చేయడాన్ని జేడీఎస్ నాయకుల తప్పుపట్టారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2007లో కుమారస్వామి లేఅవుట్‌గా నామకరణం చేసిన ప్రాంతానికి పేరుమార్చడం తగదన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పేరు మార్చరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పే వీరన్న, కృష్ణప్ప, చంద్రన్న, తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

పెనుకొండ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలమీట్ తూతూమంత్రంగా జరిగింది. 11 గంటలకు జరగాల్సిన మండలమీట్ 12 గంటలకు ప్రారంభమైంది. అధికారులు, కేవలం ఐదుగురు సభ్యులతో మండలమీట్‌ను ముగించారు. మండలవ్యాప్తంగా ఎనిమిది మంది ఎంపీటీసీలు, ఒక కోఆప్షన్‌మెంబర్ ఉండగా మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వైసీపీకి చెందిన నలుగురు ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్‌మెంబర్, ఒక టీడీపీ ఎంపీటీసీ హాజరయ్యారు. శంకర్‌నారాయణ వర్గానికి చెందిన ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీ రామాంజి మిగిలిన సభ్యులు గైర్హాజరయ్యారు. మావటూరు ఎంపీటీసీ శివయ్య అధ్యక్షతన అధికారులు మండల మీట్ జరిపించి మమ అనిపించారు. శంకర్‌నారాయణ, ఉశశ్రీ వర్గాల మధ్య మండలమీట్ నీరుగారిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రైతు సదస్సుకు తరలిరండి

రొద్దం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పెనుకొండలో నిర్వహించనున్న రైతు సదస్సుకు తరలిరావాలని వ్యవసాయాధికారి రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు పెనుకొండలోని మార్కెట్‌యార్డ్‌లో రైతుసదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవిత విచ్చేస్తారన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

మడకశిర రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప, ఎన్‌పీఎం డివిజినల్ అధికారి రమేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగు, అనుసరించవలసిన విధి విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌పీఎం అధికారులు రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరిస్తున్న అధికారులు

స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పనిచేయండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



మాట్లాడుతున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నాయకులు కార్యకర్తలు అందుకు సన్నద్ధంగా పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పంక్షన్ హాలులో హిందూపురం రూరల్ మండల టీడీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైసీపీ నాయకుల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామని, ఈ విషయంపై ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కన్వీనర్ రాము, వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ ఆనంద్, నాయకులు అరుణాచలరెడ్డి, శ్రీరామప్ప, మంజునాథ్, హనుమంతు, చిక్కీరప్ప, రామాంజి, ఉమాశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు, నాయకులు

అమరాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ముఖ్య అతిథిగా ఏపీఎంసీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ పాల్గొని స్థానిక నాయకుల నుంచి ఎదురైన సమస్యలకు పరిష్కారం సూచించారు. ఎంపీటీసీ వంకరస్వామి రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలున్నాయని, వాటిని దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయని, దానిని కట్టడి చేయాలన్నారు. అందుకు తగ్గ చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ సిద్ధేశ్వర తెలిపారు. ఏడాదిన్నర కాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్ని పంపిణీ చేశారని అడగ్గా 240 దరఖాస్తులు వచ్చాయని, 80 పంపిణీ చేసినట్లు వివరించారు. దీనిపై స్వల్ప వాగ్వాదం చోటుచేసుకోగా నాయకుల జోక్యంతో సద్దుమణిగింది. సభ్యులు లేవనెత్తి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్‌ఎంపీపీ క్రిష్ణమూర్తి, లలితమ్మ, రవికుమార్, ఏపీఓ శివన్న, ఏఓ మంజునాథ్, ఎంఈఓసత్యనారాయణ, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

'పీఆర్సీ కమిషన్ నియమించాలి'



నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

మడకశిర టౌన్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్‌ను వెంటనే వేయాలని పీటీడీ ఉద్యోగులు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి రామక్రిష్ణ, అధ్యక్షులు ముద్దప్ప, నాయకులు పురుషోత్తం, నరేష్, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

రొద్దం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యూరియాకోసం రైతులు బారులుతీరారు. మంగళవారం రొద్దంలోని సింగిల్‌విండో సొసైటీ ఆధ్వర్యంలో యూరియాను తెప్పించగా వందలాది మంది రైతులు ఎగబడ్డారు. 180బ్యాగులు 3 గంటల్లోపు ఖాళీ అయ్యాయి. అనేక మంది రైతులు యూరియా దొరక్క వెనుదిరిగారు.

రేపు పురానికి బాలకృష్ణ

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం హిందూపురానికి రానున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం చిలమత్తూరు మండలం టేకులోడు గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన ల్యాబ్, వసతి గృహాలను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ నుంచి హిందూపురం మండలం పూలకుంటలో సూర్యఘర్ పథకంలో భాగంగా ఇంటిపై సోలార్ ప్లాంట్‌ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంని ప్రారంభిస్తారు. సాయంత్రం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష, సూరప్పకుంట సుందీకరణపై జిల్లా అటవీశాఖ అధికారులతో సమావేశం, నియోజకవర్గంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్ష జరపనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఎంజీఎం క్రీడామైదానంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం ఆర్టీసి బస్టాండులో సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో భాగంగా స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభిస్తారని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి: ఏఓ

సోమందేపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించి ప్రతిరైతు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదుచేసుకోవాలని ఏఓ విజయభారతి పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ్రాయనపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. పంట నమోదు చేసుకోవడంవల్ల ఇన్సురెన్స్, ఇన్‌పుట్‌సబ్సిడీ, విత్తన కొనుగోలు తదితర లాంటి పథకాలు పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ కోసం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌ను లింక్ చేసుకోవాలన్నారు. వరి పంట సాగుచేసినవారు ఈనెల 15లోపు ఇన్సురెన్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హరిక్రిష్ణ, ఏఈఓ అలైఖ్య, ఎంపీఈఓ హరీష్, ధనుంజయ, రైతులు పాల్గొన్నారు.

'రాజకీయ కక్షతో పదవి నుంచి తొలగించారు'

పావగడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షతోనే మంత్రి రాజన్నను మంత్రి పదవి నుంచి తొలగించారని వాల్మీకి సంఘం నాయకులు అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వాల్మీకి సంఘం నాయకులు సమావేశమయ్యారు. రాజన్నకు మద్దతుగా బుధవారం తుమకూరులో నిరసనను చేపడుతున్నామన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజన్న ఎంతో సేవ చేశారన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించాలన్నారు. అటువంటి నాయకుడిని మంత్రి పదవి నుంచి తొలగించడం బాధాకరమన్నారు. నిరసనకు వాల్మీకి సంఘం నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నిడుగల్ వాల్మీకి పీఠాధిపతి సంజయ్‌కుమారస్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పరిగి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జమేదారు గంగరాజు, సునీల్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం గార్మెంట్స్ వద్ద ఆటోడ్రైవర్లకు పలు సూచనలు చేశారు. అతివేగం, సౌండ్‌సిస్టమ్, అధికమంది ప్రయాణికులతో ప్రయాణిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌సీలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ మృతి

గోరంట్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన బెల్దారి చాకలి శ్రీనివాసులు (32) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులు అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించారు. కాగా టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణీ, సర్పంచ్ భర్త అశ్వర్థరెడ్డి తదితరులు ఆయన మృతికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికే అదాలత్

టీజీఆర్‌ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి



అదాలత్‌లో పాల్గొన్న చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకే విద్యుత్ అదాలత్ నిర్వహించినట్లు టీజీఆర్‌ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం వద్ద ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వాతంత్ర్య సభ్యురాలు విజయలక్ష్మీ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈ అదాలత్ నిర్వహించడంవల్ల వినియోగదారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. 17రకాల సమస్యలు వినియోగదారులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో విద్యుత్ బిల్లులు సమస్యలు ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు ఇతర సమస్యలను అదాలత్‌లో పెట్టగా వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో ఇళ్లపై వెళ్లిన విద్యుత్ తీగలు తొలగించాలని టీడీపీ ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షులు రియాజ్ తదితరులు విన్నవించారు. ఈ మేరకు హిందూపురంలో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో కాలనీవాసులు వినతిపత్రం అందించారు. ఇందిరమ్మ కాలనీలో 200ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్లపై 11కేవీల విద్యుత్ లైన్లు వెళ్లాయని విద్యుత్ అధికారులకు ఎన్నిమార్లు తొలగించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు డైరెక్టర్ పదవి అవసరమా..?

- జేడీఎస్ నాయకులు

పావగడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంకు డైరెక్టర్ పోస్టుకు ఎమ్మెల్యే వెంకటేశ్ నామినేషన్ దాఖలు చేయడం స్వార్థపూరిత రాజకీయమని జేడీఎస్ నాయకులు, రైతుం సంఘం యువ అధ్యక్షుడు గంగాధర్‌నాయుడు ఆరోపించారు. ఆయనకు ఆ పదవి అవసరమా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా, తుమల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనకు మరో పదవి ఎందుకన్నారు. మరొకరికి కేటాయించి ఉంటే బాగుండేదన్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించండి

- డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం అన్నారు. మంగళవారం హిందూపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పీపీ యూనిట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులకు పలుసూచనలు ఇచ్చారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీనివల్ల రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారన్నారు. జ్ఞాపకశక్తికూడా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఆల్‌బెండజోల్ మాత్రలను పిల్లలకు డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి కదిరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.



వైద్యులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ

సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధమే లక్ష్యం

- నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నరసింహరాజు

మడకశిర టౌన్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేదం లక్ష్యంగా పెట్టుకొన్నామని, వ్యాపారులు అందరూ సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని వ్యాపారస్తులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని హోటల్, దుకాణదారులు, వ్యాపారాలు నిర్వహించేవారు ప్లాస్టిక్ నిషేదానికి సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు, పేపర్ కప్పులు తదితర వాటిని వాడి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పిలుపునిచ్చారు, ఆగస్టు 15 నుంచి ప్లాస్టిక్ నిల్వ ఉంచినా, వాడినా, అమ్మినా, కొన్నా వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరకే విక్రయించాలి

వ్యవసాయ శాఖ ఏడీ కృష్ణయ్య



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ కృష్ణయ్య

గోరంట్ల, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని హిందూపురం అగ్రికల్చర్ ఏడీ కృష్ణయ్య దుకాణదారులను హెచ్చరించారు. గోరంట్లలోని ఎరువుల దుకాణాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంతకుముందు మండలంలోని గోపిదేవరపల్లిలో పొలం పిలుస్తోందిలో పాల్గొన్నారు. ఖరీఫ్ పంటలు సాగుచేసిన ప్రతిరైతు ఈపంట ద్వారా ప్రతి సర్వేనెంబర్‌ను నమోదు చేయించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతులు సచివాలయంలో సంప్రదించాలన్నారు. ఆయనతోపాటు ఏఓ శంకర్‌నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



పెనుకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో గత మూడు రోజులుగా నిర్వహించిన ఆరాధనోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఆఖరి రోజు ఉత్తరారాధన కార్యక్రమంలో భాగంగా అర్చకులు వాదిరాజులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. బ్రాహ్మణ అన్నసంతర్పణ గావించారు.

తుమ్మల మారెమ్మకు పూజలు



గుడిబండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మలమారెమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రిలియన్స్ ఇంగ్లీష్ మీడియా పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. ఈనెల 10న గౌరీబిదనూరులో జరిగిన జాతీయస్థాయిలో జరిగిన పోటీలకు విద్యార్థులు పర్వ, ఆనంద్, కీర్తన, మోక్షజ్ఞ, ప్రథమ స్థానంలోను, లలితశ్రీ ద్వితీయ, సలోని కుమారి తృతీయస్థానంలో నిలిచారన్నారు. విజేతలను నాగవేణి, రామచంద్ర అభినందించారు.

చిన్నారుల ఆహారపు అలవాట్లపై దృష్టి పెట్టాలి

- వైద్యుడు డాక్టర్ కేశవులు

చిలమత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల ఆహారం విషయంలో పెద్దలు ప్రత్యేక దృష్టి పెట్టాలని చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ కేశవులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఎస్‌వైవీఎన్ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం సంకల్ప్ సంపూర్ణ స్వాస్థ్య బడి పిల్లల జాతీయ ఆరోగ్య అవగాహన కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కేశవులు మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లల ఆహారపు అలవాట్లు దారుణంగా ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించాల్సి ఉండగా జంక్ ఫుడ్, ఇతర కెమికల్స్ కలిగిన ఆహార పదార్థాలను అందిస్తున్నారన్నారు. మంచి ఆహారం ఇవ్వడంతోపాటు పిల్లలకు వ్యాయామం అలవాటు చేయాలన్నారు. సీజనల్‌గా లభించే పండ్లను చిన్నారులకు అలవాటు చేయాలన్నారు.

అదనపు సీట్లకు నేడు కౌన్సెలింగ్

రొళ్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మరహట్టి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లేపాక్షిలో తిరంగా ర్యాలీ

లేపాక్షి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న సందర్భంగా లేపాక్షి బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం తిరంగ ర్యాలీ జరిగింది. స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాలలో 600 అడుగుల జాతీయ జెండాతో లేపాక్షి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నంది విగ్రహం నుంచి లేపాక్షి బస్టాండువరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. అదేవిధంగా సోమందేపల్లి, పెనుకొండ, గోరంట్ల, పరిగి తదితర ప్రాంతాల్లో హర్‌ఘర్ తిరంగ ర్యాలీని నిర్వహించారు. జాతీయ జెండాలతో ప్రదర్శనలు చేసి మానవహారంగా ఏర్పడ్డారు.



లేపాక్షిలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు